క్లుప్తంగా

పేదలకు పని కల్పించాలి



సంగారెడ్డి మండల కార్యాలయంలో ఆడిట్ నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ బాలరాజు

సంగారెడ్డి టౌన్: ఉపాధి హామీ పథకాన్ని పేదలకు ఉపయోగపడేలా చేయాలని జిల్లా అదనపు డీఆర్‌డీఏ బాలరాజు అన్నారు. శుక్రవారం సంగారెడ్డి మండల ఎంపీడీఓ కార్యాలయంలో 15వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలోని 11 గ్రామాలను ఆడిట్ చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఎంపీడీఓ యాదగిరి, ఎంపీఓ, ఏపీఓ, కార్యదర్శులు, ఆడిట్ సిబ్బంది, మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెక్రటరీ శ్రీనివాస్‌రావుకు అదనపు బాధ్యతలు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని తడ్కల్ గ్రామపంచాయతీ సెక్రటరీగా బక్కి శ్రీనివాస్‌రావుకు మండల పంచాయతీ ఆఫీసర్ సుభాశ్ అదనపు బాధ్యతలు అప్పగించారు. శ్రీనివాస్‌రావు ప్రస్తుతం దామర్‌గిద్దా గ్రామ పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. కాగా రెండు గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఆస్థానంలో రాసోల్ గ్రామానికి చెందిన అనిల్ విధులు నిర్వహించారు.

కాంట్రాక్టు కార్మికులకు అండగా టీపీఎస్

సదాశివపేట(సంగారెడ్డి): కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని తెలంగాణ ప్రజాశక్తి పార్టీ(టీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దొడ్ల వెంకట్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమ యజమాన్యం కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనంతో పాటు వారి సమస్యలు పరిష్కరించకుండా అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్మినెంట్ కార్మికుల మాదిరిగా కాంట్రాక్టు కార్మికులతో పని చేయిస్తూ కనీస వేతనం చెల్లించడం లేదన్నారు. సంవత్సరాలుగా పనిచేస్తున్నా చట్టం ప్రకారం రూ. 20 వేలకు పైగా వేతనం ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా పరిశ్రమ యాజమాన్యం కార్మిక శాఖ అధికారులు స్పందించి కనీస వేతనంతోపాటు సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

స్వామి వివేకానంద ఆదర్శం



వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

జహీరాబాద్ టౌన్: నేటి యువతకు స్వామి వివేకానంద ఆదర్శమని టీచర్లు అన్నారు. మొగుడంపల్లి మండలం ధనసరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను జరుపుకొన్నారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం. రమేశ్‌కుమార్, ఉపాధ్యాయులు మల్లయ్యస్వామి, డాల్‌సింగ్, జితేందర్, పరమేశ్వర్, చంద్రశేఖర్, సిద్దప్ప, మహేశ్, మంజులు, శామయ్య, సురేశ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

వెంచర్లకు అనుమతి తప్పనిసరి

కంది (సంగారెడ్డి): అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తే తొలగింపజేస్తామని ఎంపీఓ మహేందర్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని చిద్రుప్పశివారులో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్‌లలో పైపులైన్లు, రహదారిని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడారు. పంచాయతీ అనుమతి లేకుండా నిర్మాణాలను చేపట్టరాదన్నారు. కంది మండలం హెచ్‌ఎండీఏ పరిధిలో ఉందని వెంచర్ల నిర్వాహకులు, బిల్డర్లు ఎలాంటి నిర్మాణాలకైనా పూర్తి స్థాయి అనుమతి పొంది ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా విశ్వనాథ్ యాదవ్

జహీరాబాద్ టౌన్: బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా పట్టణానికి చెందిన విశ్వనాథ్ యాదవ్ నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఆయనను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన విశ్వనాథ్ మాట్లాడుతూ, పార్టీకి చేసిన సేవలకు గాను జిల్లా కమిటీ స్థానం దక్కిందన్నారు. జహీరాబాద్ ప్రాంతంలో పార్టీని బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తనకు పదవి రావడానికి కారణమైన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

సంక్రాంతి సంబురాలు

సంక్రాంతి సంబురాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం జిల్లాలోని పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. రంగవల్లులను తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు.



జహీరాబాద్: యూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో..



వట్‌పల్లి(అందోల్) ముగ్గుల పోటీల్లో విద్యార్థులు



సంగారెడ్డి టౌన్ : కల్పగూర్ పాఠశాలలో..



పటాన్‌చెరు టౌన్: విశ్వభారతి లా కళాశాలలో..



న్యాల్‌కల్(జహీరాబాద్): గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రమాదాలకు నిలయంగా చౌరస్తాలు

- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

జహీరాబాద్ బైపాస్ రోడ్డులో అల్గోల్ చౌరస్తా, రాయిపల్లి(డి), కోహీర్ మండలం దిగ్వాల్, కొత్తూర్(డి) చిత్తల్‌ఘాట్, హుగ్గెలి, బూచినెల్లి, సత్వార్ చౌరస్తాలు డేంజర్ స్పాట్లుగా మారాయి. ఫోర్ లేన్ రోడ్డుగా విస్తరించినా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించినా నివారణకు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.



ప్రమాదాలు చోటుచేసుకుంటున్న అల్గోల్ చౌరస్తా

జహీరాబాద్ టౌన్: గతంలో జహీరాబాద్ పట్టణం మీదుగా హైదరాబాద్–ముంబై జాతీయ రహదారి ఉండగా వాహనాల రద్దీ అధికంగా ఉండేది. రహదారిని నాలుగు లేన్ల రోడ్డుగా విస్తరించి పట్టణం పక్క గుండా బైపాస్ నిర్మించారు. పట్టణంలో వాహనాల ట్రాఫిక్ తగ్గింది. అయితే బైపాస్ రోడ్డుపై ప్రధాన చౌరస్తాల వద్ద అండర్ బ్రిడ్జిలు నిర్మించనందున ప్రమాదాలు చోటు చేసుకుని అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. జహీరాబాద్ బైపాస్ రోడ్డులో అల్గోల్ చౌరస్తా, రాయిపల్లి(డి), కోహీర్ మండలం దిగ్వాల్, కొత్తూర్(డి) చిత్తల్‌ఘాట్, హుగ్గెలి, బూచినెల్లి, సత్వార్ చౌరస్తాలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ప్రమాదాల కట్టడికి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

బైపాస్ రోడ్డులోని అల్గోల్ చౌరస్తా డేంజర్‌గా తయారైంది. ప్రజలు చౌరస్తా వద్ద దాటడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి దాటే సమయంలో వేగంగా వస్తున్న వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకుని పలువురు ప్రాణాలు కోల్పోయారు. వారం రోజుల క్రితం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొని ఎనిమిది మంది గాయపడ్డారు. ప్రమాదాలు జరుగుతున్నాయని అల్గోల్ చౌరస్తాను బ్లాక్ స్పాట్‌గా గుర్తించి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. వాహనాల వేగం నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు, స్టాపర్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలకు కేంద్రబిందువుగా మారింది. అల్గోల్ చౌరస్తా ప్రమాదాలకు స్పాట్‌గా మారిన విషయం తెలుసుకుని ఎమ్మెల్యే మాణిక్‌రావు ఉన్నత అధికారులు పలు మార్లు ఫిర్యాదులు చేశారు. చౌరస్తాలో అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరినా ఇంతవరకు నేషనల్ హైవే అథారిటీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. చౌరస్తాల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.28.50 కోట్లతో ప్రత్యేక ప్రణాళిక

మున్సిపల్ చైర్మన్ పాండు రంగారెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ పాలక వర్గం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదు సంవత్సరాల కాలంలో మున్సిపల్ పరిధిలోని ప్రతీకాలనీలో ఉన్న సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధికి కృషి చేశామన్నారు. ప్రధానంగా ఇంటింటికి రక్షిత తాగు నీరు అందించడంలో సఫలీకృతమయ్యామని తెలిపారు. నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలో సైతం అభివృద్ధి పనులకు రూపకల్పన చేశామని తెలిపారు. అభివృద్ధిలో భాగస్వామ్యులైన ప్రతీఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తుదిపాలక వర్గ సమావేశంలో రూ.28 కోట్ల 50 లక్షలతో రూపొందించిన ప్రత్యేక ప్రణాళికను సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పాల్గొన్నారు.

పోరాట యోధుడు పండగ సాయన్న

కాంగ్రెస్ నేత నీలం మధు



సాయన్న విగ్రహావిష్కరణలో నీలంమధు

పటాన్‌చెరు టౌన్: నిజాం రజాకర్లకు భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజల కడుపు నింపిన పోరాట యోధుడు పండగ సాయన్న అని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. వనపర్తి జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం పాన్ గల్ మండలం రాయినిపల్లి గ్రామంలో తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన సాయన్న విగ్రహాన్ని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ పేదలు ఆకలితో అలమటించకూడదని పేద ప్రజల కడుపు నింపిన మహనీయుడని కొనియాడారు.

శ్రీవారి ఆశీస్సులుండాలి

వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని వనపర్తి జిల్లా శ్రీరంగాపురంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తో కలిసి ఆయన ఉత్తర ద్వారం ద్వారా రంగనాయక స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

• కనీస వేతనం కోసం..



వినతిపత్రం అందజేస్తున్న ఆశాకార్యకర్తలు, నేతలు

కనీసవేతనం రూ.18 వేలు చెల్లించాలని ఆశావర్కర్లు కోరారు. శుక్రవారం ఖేడ్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని నాడు కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఇప్పుడు నిలబెట్టుకోవాలని సీఐటీయూ ఖేడ్ డివిజన్ కార్యదర్శి నల్లవల్లి రమేశ్ కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పీఏ వెంకట్‌రెడ్డికి పలువురు నేతలు వినతిపత్రం అందజేశారు.

– నారాయణఖేడ్:

చైనా మాంజా విక్రేతపై కేసు

పటాన్‌చెరు టౌన్: చైనా మాంజా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడలోని గిఫ్ట్ షాపులో నరేందర్ అనే వ్యక్తి చైనా మాంజాను విక్రయిస్తుండడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. దీంతో మాంజాను సీజ్ చేసి, కేసు నమోదు చేశారు.

అధ్యక్షుడిగా మల్లేశ్



మల్లేశ్

న్యాల్‌కల్(జహీరాబాద్): భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడిగా మల్లేశ్ నియమితులయ్యారు. గంగ్వార్ గ్రామానికి చెందిన ఆయన్ను ఈ స్థానంలో నియమిస్తున్నట్లు జిల్లా పార్టీ అధ్యక్షురాలు గోదావరి తెలిపారు. కొంత కాలంగా పార్టీ పటిష్టత కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్నారన్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ తరపున చురుకుగా పని చేశారన్నారు. ఆయన సేవలను గుర్తించిన అధిష్టానం మండల పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిందన్నారు. అనంతరం నూతన మండలాధ్యక్షుడు మల్లేశ్ మాట్లాడుతూ తనపై నమ్మకం పదవి కట్టబెట్టిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానన్నారు.

యూత్ డిక్లరేషన్ హామీలు నెరవేర్చాల్సిందే

సంగారెడ్డి రూరల్: యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కమిటీ కోరింది. శుక్రవారం డీఆర్‌ఓ పద్మజారాణికి నేతలు వినతి పత్రం అందజేశారు. సంఘం జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా యువతకు యూత్ డిక్లరేషన్ పేరుతో ఐదు హామీలను ఇచ్చిందన్నారు. యేటా 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పిందన్నారు. జాబ్ క్యాలెండర్ ద్వారా నియమకాలు చేపడతామని, నిరుద్యోగ భృతి రూ.4 వేలు ఇస్తామని, యూత్ కమిషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు.

జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపిక



వినయ్‌కుమార్ ఏర్పాటు చేసిన ప్రదర్శన

నారాయణఖేడ్: నిజాంపేట మండలం ర్యాలమడుగు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఉపాధ్యాయుడు ఉప్పరి వినయ్‌కుమార్ గణిత అంశంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన దక్షిణభారత సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైంది. మహబూబ్‌నగర్ జిల్లా జెడ్చర్లలో ఈనెల 7 నుంచి 9 వరకు రాష్ట్రస్థాయి ప్రదర్శన నిర్వహించగా ఆయన విజేతగా నిలిచారు. దీంతో జ్ఞాపికతోపాటు ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈనెల 21 నుంచి పుదుచ్చేరిలో నిర్వహించనున్న సైన్స్‌ఫెయిర్‌కు ప్రదర్శన ఎంపికైందని వినయ్ ఆనందం వ్యక్తం చేశారు.

విరమణ వయసు పొడిగింపు తగదు

టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అశోక్ కుమార్



పదవీ విరమణ చేసిన చంద్రశేఖర్ దంపతులను సన్మానిస్తున్న అశోక్ కుమార్ తదితరులు

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు పొడిగించడం తగదని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అశోక్ కుమార్ అన్నారు. పట్టణంలోని శాంతినగర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర్ పదవీ విరమణ చేయగా శుక్రవారం సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచడం వల్ల నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు రాకుండాపోతున్నాయని విచారం వ్యక్తం చేశారు. మళ్లీ పెంచితే ఉద్యోగాలు అందని ద్రాక్షలా తయారవుతాయన్నారు. అందుకని విరమణ వయసును పెంచరాదని కోరారు. నియామకం నుంచి పదవీ విరమణ వరకు చంద్రశేఖర్ విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యల కోసం కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ప్రధాన కార్యదర్శి అనువుల రాంచందర్, నాయులు రాంచందర్ భీంవంశీ, నర్సింహులు రాంతీర్థం, శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, పలు మండలాల అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి: కిసాన్ మోర్చా



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు, ప్రధానకార్యదర్శి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కిసాన్ మోర్చా జిన్నారం మండల నాయకులు తహసీల్దార్ భిక్షపతిని కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. రైతు కూలీలకు పెట్టుబడి సాయం 15 వేల రూపాయలు ఇస్తామని చెప్పి తీరా రూ.12 వేలు ఇస్తామనడం సరికాదన్నారు. రైతులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అర్థమవుతుందన్నారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి కార్యవర్గ సభ్యులు మధుసూదన్ రెడ్డి, జిన్నారం మండల అధ్యక్షుడు కొత్త కాపు జగన్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్: వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామివారు



జోగిపేట(అందోల్): రంగనాథ స్వామి ఆలయంలో..

భారతి సిమెంట్ ఆధ్వర్యంలో..

సంగారెడ్డి టౌన్: ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా భారతి సిమెంట్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ముందుగా భారతి సిమెంట్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కొండల్ రెడ్డి హాజరై దేవతామూర్తులకు పూజలు నిర్వహించారు. మార్కెటింగ్ చీఫ్ మేనేజర్ సతీశ్ కుమార్, టెక్నికల్ మేనేజర్ సునీల్ , సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్, డీలర్ కృష్ణకాంత్, నవీన్ పాల్గొన్నారు.



సంగారెడ్డి టౌన్ : ప్రసాదం పంపిణీ చేస్తున్న అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కొండల్ రెడ్డి

ఘనంగా ముక్కోటి ఏకాదశి

ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం ఉదయం నుంచే ఆలయాల వద్ద బారులుతీరారు. ఉత్తర ద్వారం ద్వారా దేవతామూర్తుల దర్శనం కల్పించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వెంకటాపూర్ వేంకటేశ్వర ఆలయంలో..